06ATP27_06ATP27.qxd 24-05-2024 PM 10:37 Page 1



# కర్ణాటక వార్తలు

## లోక్‌సభ ఎన్నికలు వెలువడిన తరువాత జడ్జీ తాలూకా పంచాయతీల ఎన్నికలు జరుపుతాం - సిఎం సిద్దరామయ్య


మైసూరులో విలేకరులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య.

మైసూరు,మే24,ప్రభాతవార్త ప్రతినిధి

జూన్ 6 తరువాత వీలు చూసుకుని జిల్లా పంచాయతీలు, తాలూకా పంచాయతీల ఎన్నికల నిర్వహించేందుకు ప్రభుత్వం తీర్మానం చేయనుందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య చెప్పారు.ఆయన శుక్రవారం మైసూరులో విలేకరులతో మాట్లాడారు.జడ్పీలకు తాలూకా పంచాయతీలకు వార్డుల వారుగా బీసి ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల ప్రకటించాలని సుప్రీంకోర్ట్ ఆదేశించిన నేపథ్యంలో సర్కారు ఎన్నికలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేయనుందని అన్నారు.కాగా కర్ణాటకలో 31జిల్లాల జడ్పీలకు 1116సభ్యులను, 234 తాలూకాల 3621 సభ్యులను ఎన్నుకునేందుకు రిజర్వేషన్ల ప్రకటించాల్సి ఉంది.వీటి కాలవ్యవధి 2021 ఏప్రిల్ 27కు ముగిసిపోయింది.అప్పటి నుంచి అడ్మినిస్ట్రేటర్ల ఆధ్వర్యంలోనే ఇవి పని చేస్తున్నాయి.లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత స్థానిక సంస్థల ఎన్నికలకు సర్కారు సమాయత్తం కానుందన్నారు.వచ్చే జూన్ 13న జరిగే కర్ణాటక విధానపరిషత్ ఎన్నికల్లో తన తనయుడు యతీంద్ర సిద్దరామయ్య పోటీ చేసే విషయాన్ని పార్టీ హైకమాండ్ నిర్ణయిస్తుందని చెప్పారు.గత విధానసభ ఎన్నికల్లో యతీంద్ర నాకోసం వరుణా నియోజకవర్గాన్ని వదలి పెట్టాడు.పార్టీ అధిష్టానం ఆనాడే యతీంద్రకు వచ్చే ఎన్నికల్లో సీటు ఇస్తామని హామి ఇచ్చారు.అధిష్టానం ఏ నిర్ణయం తీసకుంటుందో సర్కారు దానిని పరిపాలిస్తుందని చెప్పారు. ప్రజ్వల్ రేవణ్ణ కేసును పక్కదారి పట్టించేందుకు కుమారస్వామి సదరు విడియోల పంపిణీ చేసిన వారిపైచర్యల కోసం పదేపదే డిమాండ్ చేస్తున్నారని విమర్శించారు.ఆయనకు ఈకేసులో బాధిత మహిళలకు ఏదైనా న్యాయం జరగాల్సి ఉంటే వారికి అండగా నిలబడాలని హితవు పలికారు.బిజెపి నాయకులు గత సర్కారులో తాము చేసిన తప్పిదాలను మూసివేసేందుకు సర్కారుపైన నిరంతరం అసత్యాలను ఆరోపించి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.బెంగళూరు నగర అభివృద్ధి కోసం గత ఏడాది కాలంలో ఏయే చర్యలు తీసుకున్నామో అన్నిటిని ప్రకటిస్తామని చెప్పారు.

## కర్ణాటకకు ఎక్కువ ఇన్వెస్టుమెంట్ల రాక - ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్

బెంగళూరు,మే24,ప్రభాతవార్త ప్రతినిధి


మీడియాతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్.

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత కర్ణాటకకు పెద్దఎత్తున పారిశ్రామిక పెట్టుబడులు తరలి వస్తాయని ఉపముఖ్య మంత్రి డికె.శివకుమార్ చెప్పారు.ఆయన శుక్ర వారం బెంగళూరులో సదాశివనగర్‌లోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. సర్కారు పనితీరు బాగోలేకపోవటంతో ఇక్కడి ఇన్వెస్టర్లు తమిళనాడుకు తరలిపోతున్నారని బిజెపి చేసిన ఆరోపణలను శివకుమార్ తిప్పికొట్టారు.గత బిజెపి సర్కారు హయాంలో అన్నిటికి లంచాలు డిమాండ్ చేయటంతో అప్పుడు కొందరు రాష్ట్రం నుంచి బయటకు వెళ్లేందుకు సిద్దమయ్యారని కాంగ్రెస్ చెప్పారు. సర్కారు వచ్చిన తరువాత వారికందరికి ఇచ్చిన హామీల మేరకు పరిశ్రమలు ఎక్కడికి పోవటం లేదని స్పష్టీకరించారు. కర్ణాటక బెంగళూరులో ఇన్వెస్టు చేయటానికి విదేశీ కంపెనీలు చాలా ఆసక్తిగా ఉన్నాయని చెప్పారు. ప్రపంచ అగ్ర పారిశ్రామికవేత్తలకు చెందిన 400లకు పైగా ఎంఎన్‌సి కంపెనీలు బెంగళూరులో పనిచేయటమే దీనికి కారణమని చెప్పారు.ఇక్కడ పనిచేసే వాతావరణం శాంతిభద్రతలు బాగుండటం, పనివేళలకు హాజరయ్యే నిపుణ కార్మికులు అందుబాటులో ఉండటమే కారణమన్నారు. లోక్‌సభ ఎన్నికలు ఫలితాలు వచ్చిన తరువాత పరిశ్రమలమంత్రి ఐటిబీటి మంత్రులను సమన్వయం చేసి విదేశీ పెట్టుబడులను రప్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ప్రజ్వల్ కేసు గురించి తాను ఏమీ వ్యాఖ్యానించబోననిఅన్నారు.

## కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో కర్ణాటక షార్ట్‌ఫిలింకు అవార్డులు

బెంగళూరు,మే24,ప్రభాతవార్త ప్రతినిధి


కేన్స్‌ఫిల్మ్ ఫెస్టివల్ లో అవార్డు పొందిన కన్నడ షార్ట్‌ఫిల్మ్ దర్శకుడు సిన్మా ముఖ చిత్రం.

కర్ణాటకలోని మైసూరుకు చెందిన చిదానంద అనే దర్శకుడు తీసిన సూర్యకాంతి హొగె మొదలు గొత్తాగిద్దు అనే చిన్ననిడివి సిన్మాకు కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో అత్యుత్తమ కిరుచిత్రంగా ( లా సినేఫ్) అవార్డుకు ఎన్నికైంది.చాలా సంవత్సరాల తరువాత కన్నడ షార్టుఫిలిం రెండోసారి ఈ అవార్డును దక్కించుకుంది. పొద్దుతిరుగుడు పొగ మొదట తెలిసింది అనే చిన్ననిడివి సినిమాకు చిదానంద దర్శకత్వం వహించారు. ఈ సిన్మాకు 15వేల యూరోడాలర్ల నగదు బహుమతి లభించింది.ప్రతీరోజు సూర్యోదయానికి కారణమైన కోడిపుంజుతో ఒక తాత ఊరినుంచి పరారవ్వటం చిత్రకతగా ఉంది.పుణేకు చెందిన ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఈసిన్మాను నిర్మించింది. దీనికి సూరజ్‌ఠాకూర్ ఛాయగ్రహణం అందించారు.కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కు ప్రపంచవ్యాప్తంగా 2263 సిన్మాలు అవార్డుల కోసం రాగా వాటిలో జ్యూరీకమిటి 18సిన్మాలను చివరికి ఎంపిక చేసింది.వాటిలో కన్నడిగుడు చిదానంద తీసిన సూర్యకాంతి హొగె మొదలు గొత్తాగిద్దు ఫిలిం అత్యుత్తమ షార్టుఫిలింగా ఎంపికైంది. కేన్స్ చిత్రోత్సవంలో కన్నడ చిన్నసినిమా ఎంపిక కావటం అవార్డు గెలుపొందటం పట్ల మైసూరు దర్శకుడు చిదానందను ముఖ్యమంత్రి సిద్దరామయ్యశుక్రవారం అభినందించారు.

## బంగాళఖాతంలో వాయుగుండం

- బెంగళూరు ఇతరచోట్ల నాలుగురోజుల పాటు వానలజోరు

బెంగళూరు,మే24,ప్రభాతవార్త ప్రతినిధి

బంగాళఖాతంలో లేచిన వాయుగుండం వలన కర్ణాటక దక్షిణ భాగం లోపలి ప్రాంతాల్లో వచ్చే నాలుగు రోజులు జోరువానలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు శుక్రవారం తెలియజేశారు.కర్ణాటకలో ఇప్పటికే ముంగారు పూర్వపు వానలు జోరుగా అన్ని జిల్లాల్లో కురుస్తుండంతో వీటికి తోడు వాయుగుండం వలన కోలారు,చిక్కబళ్లాపుర,బెంగళూరు రామనగర,మండ్య,మైసూరు జిల్లాలో వానలు జోరుగా కురుస్తాయని తెలిపారు.ప్రజలు రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ పరిశోధన శాఖ అధికారులు కోరారు.

## తుమకూరు వద్ద చెన్నై బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌కు భూములు సేకరణ


ఇండస్ట్రియల్ కారిడార్ భూములను వీక్షిస్తున్న అధికారులు

తుమకూరు,మే24,ప్రభాతవార్త ప్రతినిధి

తుమకూరు తాలూకా బెళ్లావి ఫిర్కాలోని ఆరుగ్రామాల్లో 1722 ఎకరాల్లో నిర్మాణం కానున్న చెన్నై బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ భూముల్లో నిర్మాణ పనులను శుక్రవారం జిల్లా అధికారులు పరిశీలించారు. బెళ్లావి ఫిర్కాలోని సొరెకుంట, పి.గొల్లహళ్లి, పురద కుంటె, గౌడనహళ్లి, లింగనహళ్లి, గిరియనహళ్లి గ్రామాల్లో కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డు 1722 ఎకరాలను రైతుల నుంచి సేకరించి కారిడార్ నిర్మాణ పనులను ప్రారంభించింది.తుమకూరు జిల్లాకలెక్టర్ శుభకళ్యాణ్ మాట్లాడతూ ఈ పఆరింశ్రామిక నడవా ద్వారా వేలాది మంది స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు.తుమకూరు జిల్లాను కూడా పారిశ్రామికీకరణలో భాగం చేసేందుకు సర్కారు తీసుకున్న నిర్ణయం ఇదని చెప్పారు.కారిడార్‌లో ఉత్తమ రహదారులు కాలువలు,విద్యుత్ కనెక్టివిటి,రవాణా సౌకర్యాలు పారిశ్రామిక సంస్థలకు సాయం చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తునట్లు చెప్పారు.స్థలంలో హాజరైన ఈశ్వరయ్య అనే రైతు మాట్లాడుతూ తన నుంచి సేకరించిన భూమిలో బోరుబావి ఉంటే సర్కారు దానికి పరిహారం ఇవ్వనేలేదని ఆరోపించారు.తమ నుంచి సేకరించిన భూములకు మరింత పరిహారం ఇవ్వాలని అధికారులను కోరారు. జిల్లా కలెక్టర్ వెంట జాతీయ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ రోహిత్ ఉపాధ్యాయ, కెఐఎడిబి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టిఎస్.లక్ష్మీష్ తదితరులు పాల్గొన్నారు.ఈ కారిడార్ చెన్నైనుంచి కోలారు జిల్లా మాలూరు,బంగారుపేటల మీదుగా నిర్మిస్తున్నారు.

## బెళగావి జిల్లాలో పిడుగులు ఇరువురు మృతి

బెళగావి ,మే24,ప్రభాతవార్త ప్రతినిధి

బెళగావి జిల్లా రాయబాగ చిక్కోడి ప్రాంతాల్లో గురువారం సాయంత్రం పిడుగులు పడి వేర్వేరు సంఘటనలో ఒక పురుషుడు ఒక గృహిణి మృతి చెందారు ఆరుగురు వ్యక్తులు గాయాల పాలయ్యారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు జిల్లాలోని రాయభాగ్ తాలూకాలోని ఒక గ్రామంలో పిడుగుపాటు శోభాకృష్ణ(540 అనే గృహిణి మృతి చెందగా మరో ఆరుగురు గాయపడ్డారు.మరోసంఘటనలో చిక్కోడి ప్రాంతంలో ఒక పొలంలో గొర్రెలు మేపుతున్న కాపరి పైన పిడుగు పడి గురుపుండలీక మృతి చెందాడు.అతడికి ఉన్న 12గొర్రెలు పిడుగుపాటుకు మృతి చెందాయి.స్థలానికి రెవెన్యూ అధికారులు హాజరై పరిశీలించారు.

## బెళగావిలో గుంపు ఘర్షణ పదిమందిని అరెస్టు చేసిన పోలీసులు

బెళగావి,మే24,ప్రభాతవార్త ప్రతినిధి

బెళగావిలో గురువారం సాయంత్రం క్రికెట్ ఆడేందుకు ఇరు బృందాల మధ్య చెలరేగిన గొడవలు స్థానిక గల్లీ గొడవలుగా మార్పుచెంది రెండు వర్గాల ప్రజలు పరస్పరం రాళ్లురువ్వుకున్న సంఘటనలకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇక్కడి ఆళ్వాన్ గల్లీలోని యువకులు క్రికెట్ ఆటలాడుతుండగా గొడవ పడ్డారు.ఈ గొడవలోని స్థానికులు ముగ్గురు వ్యక్తులు ప్రవేశించి ఇరుబృందాలను రెచ్చ గొట్టడంతో ఇది మత ఘర్షణగా మార్పు చెందింది.దీంతో గురువారం రాత్రి ఆళ్వాన్ గల్లీలో కొందరు రౌడీలు పట్టాకత్తులు పట్టుకుని ప్రజలను బెదిరించటంతో స్థానికులు ఇళ్ల నుంచి పరారయ్యారు.అక్కడ రాళ్లురువ్వుడు గొడవల్లో పదిమంది గాయపడ్డారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆళ్వాన్ గల్లీలో నిషేధ ఆజ్ఞలు జారీచేశారు.మరో పదిమందిని అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి మార్టిన్ చెప్పారు.

## బెంగళూరు నగర సమస్యల గురించి 28 బిజెపి ఆందోళన : బివై.విజయేంద్ర



బిజెపి ఎంఎల్‌ఎలతో సమావేశమైన పార్టీఅధ్యక్షుడు బివై.విజయేంద్ర.

బెంగళూరు,మే24,ప్రభాతవార్త ప్రతినిధి

బెంగళూరు నగరంలో వానలకు పాడైన రహదార్లు బాగుచేయాలంటూ బిజెపి ఈనెల 28న బెంగళూరు ఫ్రీడం పార్కులో ధర్నా ఆందోళన నిర్వహించనుంది.నగరంలో శుక్రవారం పార్టీ అధ్యక్షుడు బివై.విజయేంద్ర అధ్యక్షతన జరిగిన బెంగళూరు బిజెపి శాసనసభ్యుల సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షుడు చెప్పారు.కాంగ్రెస్ సర్కారు అధికారంలోనికి వచ్చిన నాటి నుంచి బెంగళూరు అభివృద్ధిని పక్కన పెట్టిందని విజయేంద్ర ఆరోపించారు.గత బిజెపి సర్కారు హయాంలో యడ్యూరప్ప పాలనలో బెంగళూరుకు 5వేలకోట్ల రూపాయల స్పెషల్ గ్రాంటును ఇచ్చారని తెలిపారు.బసవరాజ బొమ్మాయి హయాంలోను కేంద్ర సర్కారు బెంగళూరు సిటీ అభివృద్ధికి 6వేలకోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు.సిద్దరామయ్య సర్కారు సిటీ అభివృద్ధికి ఎలాంటి నిధులు ఖర్చు చేయలేదని ఆరోపించారు.ఈ కారణం చేతనే ఇటీవల కురిసిన వానలకు బెంగళూరు నగర రోడ్లు గుంతలమయం అయ్యిందని చెప్పారు. వరద నీటి కాలువల బాగుసేతకు సర్కారు సకాలంలో నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం అయిదు గ్యారంటీ స్కీముల పిచ్చిలో పడి బెంగళూరు నగరం అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విజయేంద్ర ఆరోపించారు.నగరంలో వాన కాలంలప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.

## బెంగళూరు రేవ్‌పార్టీ పోలీసుల నిర్లక్ష్యం - ముగ్గుర సిబ్బంది సస్పెండ్

బెంగళూరు,మే24,ప్రభాతవార్త ప్రతినిధి

బెంగళూరు శివారులో జరిగిన తెలుగు సినీనటుల రేవ్‌పార్టీ గురించి ముందుగా సమాచారం తెలిసీ కూడా స్థానిక పోలీసులు నిర్లక్ష్యంచేయటంతో హెబ్బగోడి పోలీసు స్టేషన్‌కు చెందిన ముగ్గురు పోలీసులను నగర పోలీసు కమిషనర్ శుక్రవారం సస్పెండ్ చేశారు.ఈమేరకు ఆదేశాలు వెలువడ్డాయి. రేవ్‌పార్టీలో హైదారబాదు నుంచి విమానం లో వచ్చిన తెలుగు క్యారెక్టర్ యాక్టర్ హైమ మరియు ఐసి రాయ్ ఎండిఎంఎ డ్రగ్స్ సేవించారని హెయిర్ ఫాలికల్ పరీక్షల్లో నిర్ధారణ కావటంతో సదరు తారలను బెంగళూరు సిసిబి విచారణకు పిలవాలని నగర పోలీసులు నిర్ణయించారు.వాసు అనే వ్యక్తి బెంగళూరు జిఆర్.ఫారంహౌస్‌లో బర్త్‌డే వేడులకను నిర్వహించేందుకు పోలీసుల అనుమతి కావాలని నెలరోజుల కిందటే ఎలక్ట్రానిక్స్‌సిటీ పోలీసులకు మనవి చశాడని అక్కడి పోలీసులు రిసార్టులో జరిగే వేడుకలకు తమ పర్మిషన్ దేనికని నిర్లక్ష్యం చేశారు. ఇదే సమస్యలకు కారణమైందని చెబుతున్నారు.వాసు తన పుట్టినరోజు వేడుక పేరిట రేవ్‌పార్టీ నిర్వహించేందుకు 40లక్షలు ఖర్చుచేశాడని పోలీసులు సమాచారం ఇచ్చారు.ఈ రేవ్‌పార్టీలో స్థానిక పోలీసుల కుమ్మక్కు ఉందని శుక్రవారం వార్తలు గుప్పుమన్నాయి.అయితే బెంగళూరు సిటీ క్రైంబ్రాంచ్ పోలీసులు తాజాగా ఈకేసును దర్యాప్తు చేస్తుండటంతో అన్ని వివరాలను వారు సేకరిస్తున్నారు.

## ఉరవకొండలో పకడ్బందీగా ఫ్రైడే డ్రై డే కార్యక్రమం

ఉరవకొండ, మే 24 ప్రభాతవార్త


నీటి కుంటలో ఆయిల్ బాల్స్ వేస్తున్న దృశ్యం

పట్టణంలో శుక్రవారం మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పకడ్బందీగా జరిగింది. పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్ సాహెబ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమాన్ని జిల్లా మలేరియా సహాయ అధికారి కె.సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి బి.కోదండరామిరెడ్డి తనిఖీ చేశారు. పట్టణంలోని ఐదు సచివాలయ పరిధిలోని 20 వార్డుల్లో వైద్య ఆరోగ్య సిబ్బందితోపాటు పర్యటించిన అధికారుల బృందం ప్రజలకు ఫ్రైడే డ్రైడే యొక్క ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మల్లేశ్వరస్వామి ఆలయంవద్దగల కుంట, ఇతరత్రా ప్రాంతాల్లో మురికినీరు నిల్వల్లో దోమల పెరుగుదలను నివారించడానికిగాను ఎంఎల్ ద్రావణంతో తయారు చేసిన ఆయిల్ బాల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా ప్రజలకు దోమ కాటువల్ల వచ్చే వ్యాధులను వివరించారు. పట్టణంలో మురుగునీటి కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సూచించారు. డ్రై డే ప్రయోజనాలను వివరించే కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. అనంతరం జిల్లా మలేరియా సహాయ అధికారి కె.సత్యనారాయణ స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలోని ల్యాబ్‌ను తనిఖీ చేసి మలేరియా పరీక్షల వివరాలను తెలుసుకొని ఆసుపత్రి వైద్యాధికారి జి.ఎల్లోజీతో సమావేశమై పలు అంశాలను చర్చించారు. అంతకు ముందు ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

## 10వ తరగతి అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలకు 424 మంది విద్యార్థులు గైర్హాజరు

-767 మంది విద్యార్థులకు 340 మంది మాత్రమే హాజరు

ఉరవకొండ, మే 24 ప్రభాతవార్త

శుక్రవారం నుండి మొదలైన 10వ తరగతి అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలకు 424 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్ప తెలిపారు. పరీక్షల కోసం మండల కేంద్రంలో 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా తొలిరోజు పరీక్షకు 767 మంది విద్యార్థులకు గాను 340మందివిద్యార్థులు మాత్రమే హాజరయ్యారన్నారు. ఎస్.కె. ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెంటర్‌లో 119 మంది విద్యార్థులకుగాను 46 మంది మాత్రమే హాజరుకాగా 73 మంది గైర్హాజరయ్యారు. జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల సెంటర్‌లో 121 మందికిగాను 53 మంది హాజరుకాగా 68 మంది గైర్హాజరయ్యారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల సెంటర్‌లో 120 మందికిగాను 43 మంది హాజరుకాగా 77 మంది గైర్హాజరయ్యారు. ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సెంటర్‌లో 127 మందికిగాను 68 మంది హాజరుకాగా 59 మంది గైర్హాజరయ్యారు. మహేశ్వరి ఇంగ్లీష్ మీడియం పాఠశాల సెంటర్‌లో 91 మందికిగాను 40 మంది హాజరుకాగా 51 మంది గైర్హాజరయ్యారు. వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సెంటర్‌లో 109 మందికిగాను 51 మంది హాజరుకాగా 58 మంది గైర్హాజరయ్యారు. ఉషోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెంటర్‌లో 80 మందికిగాను 39 మంది హాజరుకాగా 41 మంది గైర్హాజరయ్యారు.

## గొడవలు, అల్లర్ల జోలికెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దు

- నెరమెట్ల, రాయంపల్లి గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ఉరవకొండ, మే 24 ప్రభాతవార్త


గ్రామసభలో మాట్లాడుతున్న ఎస్ఐ రాఘవేంద్రప్ప

గొడవలు, అల్లర్ల జోలికెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఉరవకొండ ఎస్ఐ రాఘవేంద్రప్ప సూచించారు. జిల్లా ఎస్పీ గౌతమి శాలి ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన మండల పరిధిలోని నెరమెట్ల, రాయంపల్లి గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్, గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాఘవేంద్రప్ప మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆరోజు, ఆ తరువాతి రోజుల్లో కూడా ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా శాంతిభద్రతల సమస్య సృషించాలని ప్రయత్నిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల నియమావళిను ప్రతిఒక్కరూ తప్పక పాటించాల్సి ఉంటుందని సూచించారు.

## 26న వీరశైవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం

-ముఖ్య అతిథిగా హాజరు కానున్న గవిమఠం ఉత్తరాధికారి జగద్గురు డా॥కరిబసవరాజేంద్రస్వామి

ఉరవకొండ, మే 24 ప్రభాతవార్త

ఈనెల 26వ తేదీన ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఉరవకొండ పట్టణంలోని వీరశైవ కళ్యాణ మండపంలో వీరశైవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం జరుగుతుందని తాలుకా వీరశైవ సమాజం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ముందుగా ప్రకటించిన విధంగానే 10వ తరగతి పరీక్షల్లో 60శాతం మార్కులతో ఉతీర్ణులైన విద్యార్థులకు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యే గవిమఠ సంస్థానం ఉత్తరాధికారి జగద్గురు డాక్టరు కరిబసవరాజేంద్రస్వామి చేతుల మీదుగా పురస్కారాలను ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ఎంపిక కాబడిన విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, ఉరవకొండ తాలుకాలోని వీరశైవులు హాజరు కావాలని వారు కోరారు.

## ఘనంగా ఉరుసు మహోత్సవాలు

గుత్తి, మే 24 ప్రభాతవార్త


దర్గాను అలంకరించిన దృశ్యం

పట్టణంలోని కర్నూల్‌రోడ్డులో వెలసిన హజరత్ ఖాజాబందేనవాజ్ దర్గాలో ఉరుసు మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనల మేరకు 144 సెక్షన్ అమలులో వుండడంతో ఉత్సవాలు దర్గా ఆవరణకే పరిమితమయ్యాయి. ఈ సందర్భంగా ముతవల్లి ఆధ్వర్యంలో గంధోత్సవాన్ని నిర్వహించారు. 25న ఉరుసు, 26న జియారత్ నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ పేర్కొంది. ఈ కార్యక్రమంలో జలీల్, రషీద్, షఫి, అబ్జల్, రఫి, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిలో చోరీ

**గుత్తి, మే 24 ప్రభాతవార్త** : పట్టణంలోని ఏపిఎస్ థియేటర్ ఎదురుగా వున్న సబిహా స్టీల్ దుకాణంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు షెట్టర్ బద్దలు కొట్ట లోనికి చొరబడి 12 వేల రూపాయల నగదు, ఒక సెల్‌ఫోన్ చోరీ చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు సిఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

**చోరీ స్థలాన్ని పోలీసులు పరిశీలిస్తున్న దృశ్యం ➤**



## రాయితీపై వేరుశనగ విత్తన పంపిణీ

గుత్తి, మే 24 ప్రభాతవార్త


వేరుశనగ విత్తన పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం నుండి రైతుల సౌకర్యార్థం రాయితీపై వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా తొండపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో పంపిణీ కార్యక్రమాన్ని ఎడిఎ వెంకటరాముడు, ఎఒ ముస్తాక్‌అహమ్మద్‌లు ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకున్న రైతులకు 40 శాతం రాయితీపై విత్తనాన్ని పంపిణీ చేస్తామని వారు పేర్కొన్నారు. మండలానికి 4,300 క్వింటాళ్ల విత్తనం కేటాయించడం జరిగిందని 3,410 మంది రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికి విత్తనం అందచేసేందుకు చర్యలు చేపడతామని వారు తెలిపారు.

## రైలుకిందపడి వ్యక్తి మృతి

గుత్తి, మే 24 ప్రభాతవార్త


రైలుకిందపడి వ్యక్తి మృతి చెందిన దృశ్యం

పట్టణంలోని రైల్వే యార్డు సమీపంలో శుక్రవారం ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. యాడికి మండలం నిట్టూరు గ్రామానికి చందిన కంబగిరిస్వామి (50) అనే వ్యక్తి గత కొంతకాలంగా చెత్తను ఏరుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతను యార్డు సమీపంలో చెత్త ఏరుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొంది. ఈ సంఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసుల నాకాబంది - 6 బైకులు సీజ్

గుత్తి, మే 24 ప్రభాతవార్త


పోలీసులు నాకాబంది నిర్వహిస్తున్న దృశ్యం

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా నాకాబంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం బుడగజంగాల కాలనీలో సిఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ నబీరసూల్, సిబ్బంది నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తుల గృహాల్లో తనిఖీలు చేశారు. నెంబర్ ప్లేట్లు లేని 6 మోటర్‌సైకిళ్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. 144 సెక్షన్ అమలులో వున్న నేపథ్యంలో జనాలు సమూహంగా గుమికూడినా లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

## సీజలన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

పుట్టపర్తి రూరల్ మే 24 ప్రభాతవార్త


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది.

సిజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అప్రమత్తత ఎంతో అవసరమని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య వైద్యసిబ్బంది కొరారు.వారు శుక్రవారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ప్రశాంతి గ్రామం సమీపంలో సీజనల్ వ్యాధులు అడల్ట్ బిసిజి వాక్సిన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ వాక్సిన్ వలన క్షయవ్యాధి నిర్మూలించవచ్చునని తెలిపారు.ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం సాగించాలని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని,వ్యక్తిగత శుభ్రత పౌష్టికాహారం తీసుకొవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని డ్రైడే ఫైడే పాటించి జ్వరాల బారినపడకుండా దోమ పుట్ట కూడదు,అది కుట్ట కూడదని చిన్నదోమ పెను ప్రమాదమని అందుచేత దోమకాటుకు గురికాకుండా చూడాలని దోమలను నవివారించడానికి నీటి నిల్వలు లేకుండా చూసి దోమలకు ఆవాసాలు నాశనం చేయాలన్నారు.వేపాకు పొగ దోమలకు సెగ అని తెలిపారు.మలేరియా డెంగ్యూను దూరం పెట్టాలని ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్,సబ్ యూనిట్ అధికారి రమణయ్య,సూపర్ వైజర్ వెంకటరమణ,ఎస్‌టిఎస్ అబీద్ ఆరోగ్య కార్యకర్త అమృత ఆశా కార్యకర్త అనిత పాల్గొన్నారు.

## విస్తృతంగా పోలీసుల తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది.

పుట్టపర్తి రూరల్ మే 24 ప్రభాతవార్త

ఎన్నికలు ముగిసిన తరువాత కౌంటింగ్ వచ్చే నెల 4న నిర్వహిస్తున్న సందర్భంగా పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు.శుక్రవారం జిల్లా ఎస్పి మాధవరెడ్డి ఆదేశాలతో సిఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెంగళమ్మచెరువు,బ్రాహ్మణపల్లిలో ఈ తనిఖీలు చేపట్టారు.గడ్డివాములు,ఇల్లు పరిసరాలు ఇంటింటికి తిరిగి పరిశీలించారు.కౌంటింగ్ జరిగే నేపథ్యంలో గ్రామాలలో ఘర్షణలు,గొడవలు తలెత్తకుండా పోలీసులు విస్తృతంగా గ్రామాలలో పర్యటిస్తు ప్రజలు ప్రశాంతంగా ఉండాలని సూచించారు.కౌంటింగ్ తర్వాత గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా అనవసరంగా కేసులలో ఇరుక్కోకుండా జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు తెలిపారు.జూన్ 6 వరకు 144 సెక్షన్ కొనసాగుతుందన్నారు.ఈ సెక్షన్ ప్రకారం ఎక్కడ గుంపులు గుంపులుగా ఉండరాదని ర్యాలీలు నిర్వహించరాదని.బాణాసంచా కాల్చరాదని,ఆ విధంగా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.గతంలో జరిగిన ఘర్షణలను దృష్టిలో ఉంచుకొని ఆయా గ్రామాలలో తగిన బందొబస్తు ఏర్పాటు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు,ఏఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

